క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన హంసధ్వని కూచిపూడి నృత్యాలయానికి చెందిన కళాకారులు శనివారం నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై సీహెచ్ అజయ్‌కుమార్ సారథ్యంలో శిష్యబృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం కళాకారులకు దేవస్థాన అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

డెప్యూటీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రత్నరాజు



ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): దుర్గగుడి డెప్యూటీ ఈవోగా రత్నరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నరాజు దుర్గగుడి డెప్యూటీ ఈవోగా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం దుర్గగుడి డెప్యూటీ ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న లీలాకుమార్‌ను పెదకాకాని ఆలయానికి ఈవోగా బదిలీ చేశారు.

వైభవంగా శత సహస్ర లక్ష్మీగణపతి హోమం

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో లోక కల్యాణార్థం శివరామకృష్ణ క్షేత్రంలో 24 రోజులుగా నిర్వహిస్తున్న శత సహస్ర(లక్ష) లక్ష్మీగణపతి పూజ ముగింపు దశకు చేరుకుంది. శనివారం నాటి కార్యక్రమంలో శృంగేరీ క్షేత్రం నుంచి వచ్చిన వేద పండితులు గణపతి పూజ, గణపతి అధర్వశీర్షోపనిషత్ పారాయణ, సహస్ర నామార్చన కార్యక్రమంతో పాటు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ 29 వ తేదీ ఆదివారంతో హవన కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. ఉదయం జరిగే పూర్ణాహుతి కార్యక్రమంలో పలువురు ధర్మాచార్యులు పాల్గొంటారని వివరించారు.

సాహితీమూర్తులను స్మరించుకోవాలి

విజయవాడ కల్చరల్: సాహిత్యరంగంలో విశేషమైన కృషి చేసిన సాహితీ మూర్తులను స్మరించుకోవాలని విద్యావేత్త బండ్ల మాధవరావు అన్నారు. సాహితీమిత్రులు సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ హాల్‌లో శనివారం కవితా, కథా రచయిత డాక్టర్ కె.ముత్యం కథా రచయిత కాశీభట్ల వేణుగోపాల్ సంస్మరణ సభను నిర్వహించారు. ముత్యం సాహితీ సేవలను బండ్ల మాధవరావు, కాశీభట్ల వేణుగోపాల్ సాహిత్య విశేషాలను నండూరి రాజగోపాల్ వివరించారు. సమావేశంలో సాహితీవేత్తలు వేణుగోపాల్, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

డీఈవో సుబ్బారావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు వక్తృత్వం, క్విజ్ వంటి అంశాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ జిల్లా అధికారి యువీ సుబ్బారావు అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర -2047 పేరుతో జిల్లా స్థాయిలో వక్తృత్వం, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో కార్యాలయంలో శనివారం బహుమతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో సుబ్బారావు విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం మాట్లాడుతూ విజేతలను, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు స్టేర్‌లిఫ్ట్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో స్టేర్‌లిఫ్ట్‌ను దేవస్థానం ఏర్పాటు చేసింది. దుర్గగుడి ఘాట్‌రోడ్డు మీదగా వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలంటే మెట్లపై నుంచి కిందకు దిగడం తప్పని సరి. వృద్ధులు, వికలాంగులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి చిన్న గాలిగోపురం నుంచి స్కానింగ్ పాయింట్ వరకు ఈ స్టేర్‌లిఫ్ట్‌ను ఏర్పాటు చేసింది. సుమారు వంద కేజీల వరకు బరువు మోయగలిగేలా ఈ లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. శనివారం లిఫ్ట్ ఏర్పాటు పనులు పూర్తికాగా, ప్రయోగాత్మకంగా పరిశీలించారు. దసరా ఉత్సవాల్లో ఈ లిఫ్ట్ వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశాలను దేవస్థాన ఇంజినీరింగ్ విభాగం పరిశీలిస్తోంది.

కుల మతాల చిచ్చు పెట్టడమే చంద్రబాబు లక్ష్యం

- వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు
- చంద్రబాబు పాప ప్రక్షాళన కోసం ప్రత్యేక పూజలు
- పెద్ద సంఖ్యలో హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు రాష్ట్రంలో కులమతాల మధ్య చిచ్చు పెట్టడం కోసం టీటీడీ ప్రతిష్టను దిగజారుస్తున్నాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దిగజార్చిన చంద్రబాబు పాప ప్రక్షాళన కోసం పాతబస్తీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా ఇతర కార్పొరేటర్లతో కలిసి స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ తిరుమల లడ్డూ తయారీ విషయంలో జరగనిది జరిగిందని చెప్పడం, తిరుపతి లడ్డూ పవిత్రతను, స్వామి వారి పవిత్రతను తగ్గించే విధంగా ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు నాయుడు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. నాణ్యమైన నెయ్యి, సామగ్రి వాడుతున్నామని, అన్ని పరీక్షలు చేసి సర్దిపై చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు చాలా స్పష్టంగా చెప్పారన్నారు. టీటీడీ వెబ్‌సైట్‌లోనూ దానిని పొందుపరిచారన్నారు. జూలైలో అది వెజిటబుల్ ఫ్యాట్ అని చెప్పారన్నారు. సెప్టెంబర్‌లో దానిని చంద్రబాబు యానిమల్ ఫ్యాట్ అని మాట మార్చారని దుయ్యబట్టారు. నిజంగా తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిపై చంద్రబాబుకు నమ్మకం ఉంటే ఆయన పవిత్రతను తగ్గించేవాడు కాదన్నారు. స్వామిని, తిరుపతి లడ్డూని అవమానించిన చంద్రబాబు ముఖ్యమంత్రిగా అనర్హుడన్నారు. స్టాండర్డ్ వాల్యూస్ లేని ట్రక్కులను వెనుకకు పంపించామని ఈవో శ్యామలరావు చెబితే, చంద్రబాబు లడ్డు తయారీలో వాడారని పచ్చి అబద్ధాలాడటం దుర్మార్గమన్నారు. గత ఐదు సంవత్సరాలలో టీటీడీ అధికారుల ఆహ్వానం మేరకే జగన్ మోహన్ రెడ్డి తిరుపతికి వెళ్లారన్నారు. నేడు ప్రతిపక్ష నేతగా వెళ్తానంటే ఇబ్బందులు కల్పించటమేమిటని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో ఈవో ఆహ్వానం మేరకు జగన్‌మోహన్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించినప్పుడు మీరు చూడలేదా, ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నపుడు కొండపైకి నడుచుకొని వెళ్లి దర్శనం చేసుకున్నప్పుడు మీరు చూడలేదా? అప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేవలం చంద్రబాబు తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడానికే లడ్డూ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుడికి వెళ్లకముందే ఆయన పర్యటనకు అనుమతి లేదని, మీరు పాల్గొనవద్దని అంటూ తిరుపతి ప్రాంత వైఎస్సార్‌సీపీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు నోటీసులు ఇచ్చారన్నారు. గతంలో నాణ్యత పరీక్షలకు నెయ్యిని మైసూరుకు పంపించేవారని, ఎప్పుడూ లేని విధంగా నేడు గుజరాత్‌కి పంపించారని ఇందులో కుట్ర కోణం దాగి ఉందన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బ తీయడానికి తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రతిష్టను తగ్గించడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. దీనిని ప్రజలందరూ గమనించి తిప్పికొట్టాలన్నారు. చంద్రబాబుకి బుద్ధిని మార్చాలని, వెంకటేశ్వరస్వామిపై అపవాదులు వేసిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండడం దౌర్భాగ్యం అని స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, శాసనమండలి సభ్యుడు రుహుల్లా, వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్, వివిధ విభాగాల చైర్మన్లు కర్నాటి రాంబాబు, మనోజ్‌కొఠారి, కార్పొరేటర్లు మణెమ్మ, శిరంశెట్టి పూర్ణ, కోటిరెడ్డి, చైతన్యరెడ్డి, ఇర్ఫాన్, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపాలి

- దుకాణాల సంఖ్యను నియంత్రించాలి
- ప్రైవేటుకు మద్యం షాపులు ఇస్తే ప్రతిఘటిస్తాం



మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్యం నూతన పాలసీని నిరసిస్తూ కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటుకు మద్యం షాపులు ఇస్తే ఆందోళన దిగుతామని హెచ్చరించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉన్న మద్యం షాపులే కాకుండా మరికొన్ని మద్యం షాపులు పెట్టేందుకు చర్యలు తీసుకుంటోందని, అంతేకాకుండా ప్రైవేట్ సంస్థలకు మద్యం దుకాణాలు అప్పగించే ప్రయత్నాలు చేస్తోందన్నారు. మద్యంతో వచ్చిన ఆదాయంతో ప్రభుత్వం నడపాలనుకుంటున్నారని దుయ్యబట్టారు. మద్యం వల్లే మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని, కుటుంబాల్లో మద్యం చిచ్చు పెడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేయాలని, ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకే అమ్మకాలు చేయాలన్నారు. గుడి, బడి తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు పెడుతున్నారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గతంలో మద్యం షాపులు వద్దన్న చోట పెట్టం అని చెప్పారని, అదే మాటపై నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు కొట్టు రమణరావు, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్, నగర కార్యవర్గ సభ్యులు డి.సీతారావమ్మ, దుర్గాసి రమణమ్మ, చింతాడ పార్వతి, నిజాపు భాగ్యలక్ష్మి, ఎ.శాంత, ఆర్.అనసూయ తదితరులు పాల్గొన్నారు

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావిత ప్రాంతమైన జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ముంపునకు గురైన అసంఘటిత కార్మికులకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీబీఆర్‌సీ సీఈఓ అల్లాడి దేవకుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ అనిల్ కుమార్ మాట్లాడుతూ బతుకు తెరువు కోసం వేర్వేరు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అసంఘటిత కార్మికులను వరద నిండా ముంచేయడం బాధాకరమని అన్నారు. వైఎస్సార్ కాలనీలో 100 కుటుంబాలు, పి.నైనవరంలో 60 కుటుంబాలు, కొత్తూరు తాడేపల్లి వేమవరంలో 40 కుటుంబాల కార్మికులకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ వైఎస్సార్ కాలనీ కోఆర్డినేటర్ మల్లేశ్వరి, టీఎల్ రాజు, రమ, ఇండియన్ లేబర్ లైన్ సభ్యులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ నేతలు

వించిపేట(విజయవాడపశ్చిమ): ధైర్యసాహసాలతో బ్రిటిష్ సైనికులనే తరిమికొట్టిన అమరవీరుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి యువత ముందుకు నడవాలని భారత ఐక్య విద్యార్థి సమాఖ్య (యూఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కన్వీనర్ సందెపోగు ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం వించిపేట, ఖాదర్‌సెంటర్‌లోని కేబీ టాలెంట్ స్కూల్‌లో భగత్‌సింగ్ 117వ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న సందెపోగు ఉదయ్‌కుమార్ విద్యార్థులతో కలసి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను లెక్కచేయని అమరవీరుడు భగత్‌సింగ్ అని, ఆయన స్ఫూర్తితో నేటి యువత సమాజంలోని అసమానతలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ నేతలు మర్రెడ్డి వెంకటరెడ్డి, కాసాని గణేష్‌బాబు, వల్లెపు లక్ష్మీనారాయణ, మంగళగిరి శేషు, అనకాపల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.


46వ డివిజన్‌లో...

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 46వ డివిజన్‌లోని కనక అప్పారావు కార్యాలయంలో భగత్‌సింగ్ 117వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి ఏఐవైఎఫ్ నగర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి మోహన్‌ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కె.గణేష్, జి.రాంబాబు, పి.శ్రీనివాస్, డి.స్వామినాథ్, వి.వెంకటేశ్వరరావు, మహిళా సమాఖ్య నాయకురాలు దుర్గాసి రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో సిల్టు తొలగించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని మూడు సర్కిళ్లలో ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం 46వ డివిజన్‌లోని మిల్క్ ప్రాజెక్ట్ వద్ద ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో సిల్టు తొలగింపు ప్రతినిత్యం జరగాలని, ఈఈలు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ప్రజారోగ్య విభాగం ఇంజినీరింగ్ విభాగం సమన్వయంతో నిత్యం మేజర్, మైనర్, మీడియం, డ్రెయిన్లను శుభ్రం చేస్తుండాలని చెప్పారు. మ్యాప్‌ల సహాయంతో మైనర్ డ్రెయిన్ల క్లీనింగ్ పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహన్, జోనల్ కమిషనర్-1 రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మణిపాల్' వైద్యుల వరల్డ్ హార్ట్ డే ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మణిపాల్ హాస్పిటల్ వైద్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మహానాడు వద్ద ఉన్న మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు శనివారం వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ గుండె వైద్యులు డాక్టర్ ఎస్.మురళీకృష్ణ మాట్లాడుతూ నడకతోనే మన గుండెకు దీర్ఘాయువు సాధ్యపడుతుందన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా.. ప్రపంచాన్ని చుట్టుముడుతున్న గుండె సంబంధిత వ్యాధులకు శరీర శ్రమ లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. అందుకే నడక, ఈత, సైక్లింగ్ తదితర శారీరక శ్రమ ద్వారా గుండెను దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని చెప్పారు. క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలిలో చాలా మంది చిన్న వయసులోనే గుండె జబ్బులతో తమ జీవితాన్ని కోల్పోతుండడం బాధాకరమన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతో వాకథాన్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నర్రా సందీప్, దిలీప్ రట్టి, లక్ష్మీ నవ్య, శ్రీనివాస్‌బాబు, సమరసింహారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఛాయా చిత్రకారుడు శ్రీనివాసరెడ్డికి ప్రతిష్టాత్మక పురస్కారం



రాజ్యలలితా అకాడమీ పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన అంతర్జాతీయ ఫొటో తమ్మా శ్రీనివాసరెడ్డికి అత్యంత ప్రతిష్టాకరమైన రాజ్యలలితా అకాడమీ పురస్కారం లభించింది. శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ లలిత కళా అకాడమీ ప్రతి ఏటా జాతీయ స్థాయిలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తుంది. నగరానికి చెందిన శ్రీనివాసరెడ్డి కేరళలోని తియ్యం నృత్యంపై తీసిన చిత్రాన్ని న్యాయనిర్ణేతలు ఉత్తమమైనదిగా గుర్తించారు. ఉత్తర ప్రదేశ్ మంత్రి లాలాజీ నిర్మల్ చేతులమీదుగా శుక్రవారం శ్రీనివాసరెడ్డి ఈ పురస్కారం అందుకున్నారు. గతంలో శ్రీనివాసరెడ్డి తీసిన పలు చిత్రాలకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా నగరానికి చెందిన కళాపోషకుడు గోళ్ల నారాయణరావుతో పాటు పలు కళా సంస్థలు శ్రీనివాసరెడ్డిని అభినందించాయి.

అజరామరం...గుర్రం జాషువా సాహిత్యం

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్



జాషువా విగ్రహానికి పూలమాల వేస్తున్న జల్లి విల్సన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కవి కోకిల, మహాకవి గుర్రం జాషువా సాహిత్యం అజరామరమని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్ అన్నారు. 'సుకవి జీవించె ప్రజల నాలుకలయందు' అన్న జాషువా కవితాక్షరాలకు నిదర్శనంగా ఆయనే నిలిచారని అన్నారు. మహాకవి, కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీల పురస్కార గ్రహీత పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతి సందర్భంగా శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని జాషువా విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జల్లి విల్సన్ మాట్లాడుతూ విశ్వనరుడు జాషువా తనకు అవమానాలు ఎదురైన చోటే సన్మానాలను అందుకున్నారని గుర్తు చేశారు. ఎన్ని ఛీత్కారాలకు గురైనా ఏనాడూ దురాగ్రహాన్ని ప్రదర్శించ లేదని, తన అక్షరాస్త్రాలతో ధర్మాగ్రహాన్ని ప్రదర్శించి తనకు సాటి వేరొకరు లేరని నిరూపించుకున్నారని చెప్పారు. సమకాలీన కవితా ఒరవడికి భిన్నంగా సంచలన కవిత్వాన్ని సృష్టించారని తెలిపారు. తెలుగు, సంస్కృత భాషల్లో అపార పాండిత్యం సొంతం చేసుకున్న జాషువా రచించిన 'గబ్బిలం'లో తన వంటి వారి అవస్థలనే కాకుండా సమాజ స్థితిగతులను సూటిగా చెప్పారని అన్నారు. తిరుపతి వేంకట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వేంకట కవి జాషువా కాలికి గండపెండేరం తొడిగి విజయవాడలో ఏనుగు అంబారీపై ఊరేగించారని గుర్తు చేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాయప్ప, అరసం రాష్ట్ర నాయకుడు కాగితాల రాజశేఖర్ మాట్లాడుతూ కవిత్వాన్నే ఆయుధంగా మార్చుకుని వర్ణ వ్యవస్థపైన, సంకుచిత భావాలపైన సవ్యసాచిలా అక్షరాస్త్రాలను సంధించిన కవి జాషువా అన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు పేరయ్య, డీబీకె రావు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

కవి జాషువాకు నృత్యనీరాజనం



జాషువా జయంతి ఉత్సవాల సందర్భంగా ఎంబీ విజ్ఞాన కేంద్రంలో నృత్యం చేస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: విశ్వనరుడు కవి కోకిల గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శనివారం వినూత్నంగా నగరానికి చెందిన పలువురు నాట్యాచార్యులు నృత్య నీరాజనం అందించారు. జనహితమే మా నాట్యం పేరుతో ఆంధ్ర నాట్య ఆచార్యులు పిళ్ళా ఉమామహేశ్వర పాత్రుడు స్వాతంత్ర్యోద్యమం అంశంగా, చెట్లు నరకడం అనర్థం అంశంగా సప్పా శివకుమార్ బృందం, స్త్రీ సౌకుమార్యం అంశంగా గోనుగుంట్ల శైలశ్రీ , రైతే రాజు అంశంగా మాగలూరి త్రినాథాచారి, పంచతంత్రం అంశంగా యల్లాజోస్యుల అనూరాధ, అమ్మే ఆదిగురువైతే అంశంగా పద్మశ్రీ హేమంత్ తమ బృందాలతో నృత్యాలను మధురంగా ప్రదర్శించారు. జయంతి సభకు యువ కవి అనిల్ డ్యానీ అధ్యక్షత వహించారు. అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, కవి పరిశోధకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఎంబీకే బాధ్యుడు మురళీకృష్ణ , గుండు నారాయణ, గోళ్ళ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- కృష్ణా వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు
- సందడిగా నలంద డిగ్రీ కాలేజి ఫ్రెషర్స్ డే వేడుకలు



ఫ్రెషర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బసవేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చదువుతో పాటు క్రీడ, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో కూడా రాణించాలని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన నలంద డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి తమ జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు పట్టుదలతో నిరంతరం కృషి చేయాలని సూచించారు. బుడమేరు వరద ముంపు సమయంలో నలంద విద్యార్థులు అందించిన సేవలు అభినందనీయమని అన్నారు. నలంద కళాశాల కరస్పాండెంట్ ఎ.విజయబాబు మాట్లాడుతూ ఈ ఏడాది మొదటి కౌన్సెలింగ్‌లోనే 98 శాతం సీట్లు భర్తీ అయ్యాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ విద్యార్థులకు సమయం వృథా కాకుండా యూనివర్సిటీ సిలబస్‌తో పాటు అదనపు కోర్సులను నేర్పిస్తున్నామని అన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా సంప్రదాయ, పాశ్చాత్య వస్త్రధారణతో విద్యార్థినులు ప్రదర్శించిన ఫ్యాషన్ షో అలరించింది. సంగీతానికి అనుగుణంగా విద్యార్థులు ప్రదర్శించిన క్యాట్ వాక్ ఆకట్టుకుంది. అనంతరం అకడమిక్ టాపర్స్‌కు, వరద సహాయక చర్యల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు.

గుండె, రేబిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ సౌరిబాల




మాట్లాడుతున్న డాక్టర్ సౌరిబాల

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వరల్డ్ హార్ట్ డే, వరల్డ్ రేబిస్ డే లను పురస్కరించుకుని విజయవాడ రైల్వే హాస్పిటల్‌లోని న్యూ ఓపీడీ బ్లాక్‌లో రెండు వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ సౌరిబాల పాల్గొని క్లిష్టమైన పలు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. వరల్డ్ రేబిస్ డే సందర్భాన్ని పురస్కరించుకుని డాక్టర్ పూర్ణచంద్రరావు రేబిస్ వ్యాధి గురించి వివరించారు. రేబిస్ వ్యాపించే పరిస్థితులు, లక్షణాలు, వాటి నివారణ చర్యలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పెంపుడు జంతువులకు టీకాలు వేయడం, వీధుల్లో సంచరించే జంతువులకు దూరంగా ఉంచడం, ఏదైనా జంతువు కాటుకు గురైతే వెంటనే వైద్యం చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చన్నారు. అనంతరం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ షైనీ బిల్లా గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం, వత్తిడి తగ్గించుకోవడం, రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యాధరపురంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన 72 అడుగుల మట్టి వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం శనివారం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు, కేరింతలతో సందడి చేశారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అలరించిన కోలాటం

సిద్ధార్థలో ఉత్సాహంగా సాగిన దసరా సాంస్కృతికోత్సవాలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, వివిధ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో దసరా సాంస్కృతికోత్సవాల్లో భాగంగా శనివారం ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులతో పాటుగా మహిళలు కూడా పాల్గొని కోలాటాన్ని ప్రదర్శించి అలరించారు. దసరా సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు కావడంతో దుర్గమ్మను కీర్తిస్తూ పాటలు పాడుతూ కోలాటాన్ని ప్రదర్శించారు. సాయంత్రం జరిగిన ఉత్సవాల ముగింపు సభకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సవాల నిర్వాహకులు విజయలక్ష్మి, కల్పన, జ్యోత్స్న, శారద, పి.మురళీకృష్ణ, జి.వాణి తదితరులు పాల్గొన్నారు.